విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 14, నవంబర్ 2024

లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలి

విశాలాంధ్ర-అనంతపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల లక్ష్యాలను 100 శాతం పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో నిర్వహించిన మెగా బ్యాంక్ లోన్ మేళా - 2024 (బ్యాంకు రుణ వితరణ కార్యక్రమం) కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత కలిగిన పేదవారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద లబ్ధి చేకూర్చాలన్నారు. కొత్తగా ఏదైనా పథకం మొదలు పెడుతుంటే భూమి, డబ్బు ఉండి వ్యాపారం పెంచుకోవాలనుకుంటున్న వారి దగ్గరికి వెళ్లి బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాకాకుండా పేదలకు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు, రైతులకు వారి కాళ్ళ మీద వాళ్లు నిలబడేలా వారికి కావాల్సిన ఆర్థిక సహాయం పొందాలంటే ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటారని తమకు ఫీడ్ బ్యాక్ వచ్చిందన్నారు. బ్యాంకర్లు, జిల్లా అధికారులు లబ్ధిదారులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు.

సిపిఐ ఉపాధ్యాయ సంఘం నాయకులు పి.లక్ష్మన్న, ఏ.సూర్య నారాయణ గౌడ్‌కు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ నివాళి

విశాలాంధ్ర, అనంతపురం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సిపిఐ నాయకుడు ఉపాధ్యాయ ఉద్యమ నేత ఎస్‌టియు సీనియర్ నాయకులు పిలక్ష్మన్న, ఏ.సూర్య నారాయణ గౌడ్‌ల సంతాప సభ ఏర్పాటు చేశారు. ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ, అనంత జిల్లా కార్యదర్శి సి.జాఫర్, పుట్టపర్తి జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నారాయణస్వామి, ఎస్టియు జిల్లా కార్యదర్శి ఎస్.రామాంజనేయులు పాల్గొని ఉపాధ్యాయ ఉద్యమ నేతల లక్ష్మన్న, సూర్యనారాయణగౌడ్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలపై వారి సమస్యల పరిష్కరించే దిశగా నిత్యంపోరాటం చేసిన ఉపాధ్యాయ ఉద్యమ నేతలని పేర్కొన్నారు. వారిద్దరి మధ్య ఉన్న తన అనుభవాలను తెలియజేశారు. ఉపాధ్యాయులు ముఖ్యంగా విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం కలిగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్ మీడియా లో వస్తున్న అశ్లీలతను నిర్మూలించే దిశగా విద్యార్థులలో చైతన్యం తీసుకు రావాలంటే ఒక ఉపాధ్యాయుని వల్లే సాధ్యమన్నారు. ఉపాధ్యాయ నేతల కుటుంబాలకు సిపిఐ రాష్ట్ర పార్టీ తరఫున ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్‌గౌడ్, నగర కార్యదర్శి ఎన్.శ్రీరాములు, నగర సహాయ కార్యదర్శి అలిపిర, ఏఐఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హను మంతు రాయుడు కుల్లాయి స్వామి నగర అధ్యక్షులు మంజునాథ్ నగర నాయకులు హరి కృష్ణతారక్ కార్తీక్, ఎస్‌టీయూ నాయకులుఅజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పెళ్లి వేడుకలో సిపిఐ నేతలు

విశాలాంధ్ర బ్యూరో, అనంతపురం.. అనంతపురం జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున కూమార్తె మౌనికా వివాహ మహోత్సవం బుధవారం అనంతపురం రూరల్ మండలంలో ఘనంగా జరిగింది. ఈ వివాహ మహోత్సవానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ మూర్తి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్. పి.రామచంద్రయ్య, జి.ఈశ్వరయ్య. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.జాఫర్, కె.రామాంజనేయులు, కె.వి.వి. ప్రసాద్, సిపిఐ జిల్లా సీనియర్ నాయకులు ఐ.రవీంద్రనాథ్, పెద్దవడుగూరు సూర్యనారా యణరెడ్డి, సత్యసాయి జిల్లా సిపిఐ కార్యదర్శి ఎం.వేమయ్య యాదవ్, అనంతపురం జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి పి.నారాయణస్వామి, విశాలాంధ్ర ఏజీఎం మనోహర నాయు డు, ఎఐవైఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు, కర్నూలు ఎడిషన్ మేనేజర్ నాగరాజు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు అదేవిధంగా టిడిపి, వైసిపి, కాంగ్రెస్ రాష్ట్ర,జిల్లా నాయకులు అధిక సంఖ్యలో వివాహ మహోత్సవానికి హాజరై మౌనికా, నరేష్ నూతన దంపతులను ఆశీర్వదించారు.

కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలి

విశాలాంధ్ర-అనంతపురం: కేంద్ర ప్రవేశపెడుతున్న వక్ఫ్ సవరణ బిల్లును ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యతిరేకించాలని "ఇన్సాఫ్" మైనారిటీ నగర ప్రధాన కార్యదర్శి ఖాజా హుస్సేన్ పేర్కొన్నారు. భారత కమ్యునిస్టు పార్టీ మైనారిటీ వింగ్ "ఇన్సాఫ్" అనంతపురం నగర సమితి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ...బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ నేతృత్వంలోని ప్యానెల్, నవంబర్ 25న ప్రారంభ మయ్యే పార్లమెంట్ శీతాకాల సమావేశాల తొలి వారంలో వక్ఫ్ బిల్లుపై తుది నివేదికను ప్రవేశపెట్టనున్నది అన్నారు. 16 మంది ఎంపీలతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్ర బాబు నేతృత్వంలోని టీడీపీ, ఎన్‌డిఎ కేంద్ర ప్రభుత్వానికి కీలక భాగస్వామ్యం అన్నారు. భారతీయ జనతా పార్టీ, కేంద్రంలో తమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో ' ఆంధ్ర రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు పాత్ర కీలకమైనదన్నారు. కేంద్ర ప్రభుత్వ వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకత తెలిపితే మోడీ ప్రభుత్వం పరిగణ లోకి తీసుకోవాల్సిన అవసరమెంతైనా ఉందన్నారు. కేరళ ప్రభుత్వం కూడా వక్ఫ్ సవరణ బిల్లుకు తమ వ్యతిరేకత తెలిపిన విషయం అందరికి తెలిసిందే అన్నారు. ఏపీలో మైనారిటీలకు మొన్న జరిగిన బడ్జెట్ సమావేశంలో ముస్లిం మైనారిటీ సంక్షేమం కోసం దాదాపు 4వేల కోట్లకు పైగా బడ్జెట్ కేటాయించడం హర్షణీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు తమ వ్యతిరేకత తెలిపితే మైనారిటీ హృదయాల్లో చంద్రబాబు నాయుడు నిలిచిపోతారన్నారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు అల్లి పీరా , అధ్యక్షులు చాంద్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఎన్.పి.సి.ఐ లింక్ తప్పనిసరి....

విశాలాంధ్ర-నార్పల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సబ్సిడీ డబ్బులు బ్యాంక్ అకౌంట్‌లో జమ కావాలంటే మండల ప్రజలు బ్యాంక్ అకౌంట్‌ను వెంటనే సంబంధిత బ్యాంక్ లేక పోస్ట్ ఆఫీస్‌లో ఎన్.పి.సి.ఐ. ఆధార్ కార్డు, మొబైల్ నెంబరుని లింక్ చేసుకోవాలని బుధవారం ఎంపీడీవో గంగావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌పిసిఐలో లింక్ చేసుకున్న తర్వాత ఖచ్చితంగా ఆ సమాచారాన్ని మీ సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శులకు సమాచారం అందివ్వాల్సి ఉంటుందని తెలిపారు.

29 మంది ఉద్యోగాలకు ఎంపిక

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీఎస్ఎస్ డిసి ఆధ్వర్యంలో బుధవారం జాబ్ మేళా నిర్వహించారు. టాటా క్యాపిటల్, నవభారత్ ఫర్టిలైజర్స్, యంగ్ ఇండియా, క్రెడిట్ ఆక్సస్, ఎల్ ఐఎఫ్ఎల్ కంపెనీలు హాజరయ్యాయి. ఇంటర్, ఐటిఐ పీజీ చదువుకున్న 45 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు రాగా 29 మందిని ఉద్యోగ అవకాశాలకు కంపెనీ యాజమాన్యాలు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ అశ్రఫ్ అలీ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, సీడప్ చైర్మన్ దీపక్ రెడ్డి ఆదేశాలు మేరకు జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన

విశాలాంధ్ర-డి.హీరేహాళ్: మండలంలోని మలపన గుడి గ్రామంలో బుధవారం ఆంజనేయస్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు తనయుడు కాలువ భరత్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామస్తులు భరత్‌కు శాలవా వేసి పూలమాలతో ఘనంగా సత్కరించారు. అలాగే సాయి బాలాజీ ఎండి శివప్రసాద్ హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో ఆర్యవైశ్య రాష్ట్ర చైర్మన్ నాగల్లి రాజు, మండల కన్వీనర్ హనుమంత రెడ్డి, ఎంపిటిసి మురడి గంగాధర, సర్పంచు రుద్రేశ్, ఉమేష్, తిమ్మప్ప పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు బూట్ల పంపిణీ

విశాలాంధ్ర-అనంతపురం: డిస్కవర్ అనిల్ కుమార్ ముంబై నుండి హై క్వాలిటీ బూట్స్ తెప్పించి ఒకటవ సర్కిల్లోని 14 సచివాలయాల పరిధిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా అనంతపురం అనిల్ కుమార్ మాట్లాడుతూ... మన కోసం ప్రాణాలను పణంగా పెట్టి నగరాన్ని శుభ్రం చేస్తున్న పారిశుద్ధ కార్మికుల బాగోగులు చూసుకోవడం ప్రభుత్వంతో పాటు ప్రతి పౌరునిపై కూడా అంతే ఉందన్నారు. ప్రాజెక్టులో భాగంగా మొదటి విడతలో సుమారు 150 మంది కార్మికులకు ఈ గంబూట్స్ అందజేసామని దీనికి సుమారు 1 లక్ష ఖర్చు అవుతుందన్నారు. డంప్‌యాడ్ చెత్తలో ఉండే ఐరన్, ఇతర వస్తువులను ఏరుకునే వారు కూడా ఈ బూట్లు ధరించే విధంగా చేస్తామన్నారు. వారికి ప్రత్యేకంగా బహుమతులు కూడా ఇస్తామని తెలిపారు.

జాబ్ మేళాలో 32 మంది ఎంపిక

విశాలాంధ్ర-రాయదుర్గం టౌన్: పట్టణంలోని పాలిటెక్నిక్, కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో బుధవారం 32 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.ఎం శ్రీనివాసులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎస్ఈఈడి ఈపి చైర్ పర్సన్ దీపక్ రెడ్డి ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించగా హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఐఐఎఫ్ ఎల్, వినూత్న ఫర్టిలైజర్, భూమిక కూటమి మొత్తం 4 కంపెనీలు పాల్గొన్నారన్నారు. 60 మంది అభ్యర్థులు హాజరుగాక అందులో 32 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ వి.ప్రతాప్ రెడ్డి, సీడ్ ఆప్ జేడీఎం, మెకానికల్ హెచ్‌ఓడి సోమ్లా నాయక్, కంపెనీ ప్రతినిధులు, ఏపీఎస్ ఎస్‌డిసి ప్లేస్మెంట్ ఆఫీసర్ మహేష్, కోఆర్డినేటర్ రాము పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

విశాలాంధ్ర-బెలుగుప్ప : స్థానిక ఉన్నత పాఠశాల (1995-1996) సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలకు రుణం తీర్చుకోవాలనే ఉద్దేశంతో బుధవారం ప్రధానోపాధ్యాయులు వెంకట ప్రసాద్ ఎంఈఓ మల్లారెడ్డి కు రూ.45 వేల విలువగల మానిటర్, సిపియు, ప్రింటర్, మౌస్, కీబోర్డ్ అందించారు. హెచ్‌ఎం, ఎంఈఓ, ఉపాధ్యాయులు పాఠశాల కమిటీ చైర్మన్ రుద్రయ్య పూర్వ విద్యార్థులను అభినందించారు.

కూడేరులో టీడీపీ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-కూడేరు: కూడేరు ఎస్సీ కాలనీ యందు సర్పంచ్ మీనుగా లలితమ్మ ఆధ్వర్యంలో బుధవారం మహిళలు టీడీపీ సభ్యత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ద్వారానే మహిళలకి అన్ని రకాలుగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని, రూ.100 అందజేసి సభ్యత్వం తీసుకుంటే ఆపదలో మనకు ఇన్సూరెన్స్ వర్తిస్తుందని తెలియజేశారు.

ప్రిన్సిపల్‌కు అభినందనల వెల్లువ

విశాలాంధ్ర-జెఎన్టియుఏ: జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.చెన్నారెడ్డి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఇటీవల ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకున్న సందర్భంగా బుధవారం మెకానికల్ విభాగం డా.కళ్యాణి రాధ, డాక్టర్ బి.ఓంప్రకాశ్ పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్సు, విభాగం వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.వసుంధర ఆచార్య సి. శోభా బిందు, ఆచార్య కె.మాధవి, డాక్టర్ రాజశేఖర్, కె.యస్.భారతి, డాక్టర్ లలిత కుమారి, సోమి చెన్నారెడ్డి పాల్గొన్నారు

హెచ్ ఎల్సి కాలువలు జోలె పట్టి మరమ్మతులు చేయిస్తాం

విశాలాంధ్ర-నార్పల: ప్రభుత్వం పై ఆధారపడకుండా రైతులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి తాము చేసుకోవాల్సిన పనులు చేయాలని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన నార్పల మండలం తుంపెర డీప్ కట్ వద్ద షెట్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిదీ ప్రభుత్వం ప్రభుత్వం అంటారు ఏది ప్రభుత్వం మనం చేసుకోవాల్సిన పని కూడా ప్రభుత్వం మీద ఆధారపడాలా సిస్టం మారాలన్నారు. తన చిన్నప్పుడు ఏటి కాలువలు ఉండవని ఎకరాకు రూపాయి పావులను అర్ధరూపాయో వసూలు చేసి కాలువలు మరమ్మతులు చేసుకునే వారమన్నారు. అప్పటికే దున్నపోతులతో వ్యవసాయం చేశారని ఈరోజు జెసిబిలు వచ్చాయి ఆధునికరణ పెరిగింది. రైతు వ్యవహారం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. ఈ పరిస్థితి మారాలని రైతులు ముందుకు వచ్చి హెచ్.ఎల్.సి ఆధునీకరణ, మరమ్మత్తు పనులకు ఎకరాకు పది రూపాయలు రెండు రూపాయలు మూడు రూపాయలు వేసుకొని మర మస్తులు చేయించుకుంటే బాగుంటుందన్నారు. కొందరు కాలువ నీటిలో నీరు తగ్గిపోయిన తర్వాత కాల్వ బండలను ఇల్లు, చించులకు కేసుకుంటున్నారన్నారు. నీరు అందరికీ కావాలని అయితే రైతులలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. తన చిన్నప్పుడు పంజాబ్‌లో బాక్రనంగల్ అనే చిన్న డ్యామ్ ఉండేదని ఆ డ్యామ్ నీరు అయిపోయిన తర్వాత యాక్షన్ ఏసుకొని కాలువలు మరమ్మత్తు చేసుకునే వారమన్నారు.

టీడీపీ కోసం దండు కష్టపడ్డాడు.. పార్టీ విస్మరించింది

విశాలాంధ్ర-శింగనమల: గత వైసిపి ప్రభుత్వంలో శింగనమలలో అధిష్టానం పిలుపుమేరకు అనేక కార్యక్రమాలు పాదయాత్రలు చేసి తన సొంత ఖర్చులతో పార్టీని నిలబెట్టిన టీడీపీ నాయకుడు దండు శ్రీనివాసులు ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అతన్ని కార్యకర్తలను పట్టించుకున్న పాపాన పోలేదని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు శింగనమల మండలంలో నామరూపల్లేకుండా ఉన్న తెలుగుదేశం పార్టీకి దండు శ్రీనివాసులు ప్రాణం పోశాడని మండలంలో ఒక్క ఎంపీ టీసి స్థానాన్ని కూడా దక్కించుకోలేని సమయంలో తెలుగుదేశం పార్టీ కోసం అష్ట కష్టాలు పడి వెస్ట్ నరసాపురం ఎంపీటీసీ స్థానాన్ని ఎస్టీలకు కేటాయించిన స్థానాన్ని దండు శ్రీనివాసులు గెలిపించుకొని తెలుగుదేశం పార్టీకి ప్రాణం పోశాడని, అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో టిడిపిగెలిచిన తర్వాత తెలుగుదేశం పార్టీలో ఇప్పుడున్న లీడర్లు అప్పుడుఎక్కడికి వెళ్లారో చెప్పాలని, దండు శ్రీనివాసులు తెలుగుదేశం పార్టీ అధిష్టానం అప్పజెప్పిన బరువు బాధ్యతలు భుజాన వేసుకొని, తెలుగుదేశం పార్టీని నిలబెట్టిన వ్యక్తిని, పక్కన పెట్టడం ఏమిటని, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, నారా లోకేష్ పాదయాత్రలో అహర్నిశలు కృషిచేసి నారా లోకేష్ కు అండగా నిలిచి పాద యాత్రని జయప్రదం చేసిన వ్యక్తిని, కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే పార్టీ కోసం నిరంతరం శ్రమించిన నాయకులను కూటమి ప్రభుత్వం మసిపూసి మారేదు కాయ చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపల్ ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం

విశాలాంధ్ర-గుత్తి: మునిసిపల్ కౌన్సిల్ హాలు లో సచివాలయ నోడల్ , సచివాలయ సిబ్బంది తో బుధవారం మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రత్యేక సమావేశంలో మునిసిపల్ కమీషనర్ బి.జబ్బార్ మియా వివరాలు వెల్లడిస్తూ సచివాలయాలలో రోజువారీ సర్వీసులు, ఆపార్ విద్యార్థుల బర్త్ సర్టిఫికెట్ల విజ్ఞప్తుల స్వీకరణ సేవలు , ఎంపీ సీఐ సేవలు, హౌస్ టు హౌస్ సర్వే 100% శాతం పూర్తి, రీసర్వే 100% శాతం పూర్తి, ట్యాక్స్ కలెక్షన్ 2024-24 - 100% శాతం పూర్తి వాటిపై ఆంధ్రప్రదేశ్ కమీషనర్,డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ జిల్లా కలెక్టర్ , ఆదేశాల మేరకు ప్రతి సచివాలయం పరిధిలో గల సచివాలయ సిబ్బందికీ కేటాయించిన నిర్దేశితాలను నిర్ణయించిన సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి సచివాలయ సిబ్బంది వారు ప్రోగ్రెస్ స్థాయి తక్కువ స్థాయిలో వున్నప్పుడు మునిసిపాలిటీ మరియు సచివాలయ ప్రగతిని మెరుగుపరచి మునిసిపాలిటి కు మంచి గుర్తింపు తీసుకుని రావాలని అందరూ సహకరించాలని కోరుతూ ప్రతి రోజు ఉదయం 8.00 గంటల సమయంలో ఆన్లైన్ సర్వర్ లు పనిచేయు సౌఖ్యమును దృష్టిలో ఉంచుకుని సచివాలయ సిబ్బంది వారు ట్యాక్స్ కలెక్షన్, సర్వేలు లు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రాంబాబు, ఆర్.ఓ సతీష్ కమలాకర్, ఆర్.ఐ షేక్షావలి, సచివాలయ నోడల్ ఆఫీసర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులకు ప్రోటోకాల్ పాటించరా?

విశాలాంధ్ర-శింగనమల (బుక్కరాయసముద్రం): ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ పాటించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని బుక్కరాయసముద్రంమండల జడ్పిటిసి నీలంభాస్కర్ అధికారులపై మండిపడ్డారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సల్మాన్ సమస్యను వివరించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి భాస్కర్ మాట్లాడుతూ ప్రజలచేత ఎన్నుకోబడిన సర్పంచులు ఎంపీటీసీలు జడ్పిటిసిల కి ఎందుకు ప్రోటోకాల్ పాటించలేదని ఎంపీడీవో సల్మాన్ ను నిలదీశారు. ప్రభుత్వ కార్యక్రమాలలో అనేకమార్లు అధికారులు ప్రతిపక్ష పార్టీలకు సంబంధించిన ప్రజాప్రతినిధులకు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో పాటు ప్రోటోకాల్ కూడా పాటించడం లేదని మండిపడ్డారు. ఇదేం పద్ధతి బాగాలేదని హెచ్చరించారు. కేకే అగ్రహారం గ్రామంలో పౌర హక్కుల సమావేశానికి జిల్లా కలెక్టర్ ఎస్పీ జిల్లా అధికార యంత్రాంగం అంతా వచ్చి సమావేశం నిర్వహించగా తనను ఎందుకు ఆహ్వానించలేదని నిలదీశారు. అంతే కాకుండా మండల కేంద్రంలో రెండు రోజులుగా జరుగుతున్న గ్రామాల అభివృద్ధి పై ప్రణాళిక శిక్షణ సమావేశాలకు జడ్పిటిసి తో పాటు పలువురికి ఎంపీటీసీ సర్పంచులను ఎందుకు ఆహ్వానించడం లేదని మండిపడ్డారు. దళిత ప్రజా ప్రతినిధిని అయి ఉండి కూడా తనకు ప్రోటోకాల్ కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాగే కొనసాగితే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రికలు విడుదల

విశాలాంధ్ర-తాడిపత్రి: పట్టణంలోని మండల విద్యాశాఖ కార్యాలయం వద్ద బుధవారం గ్రంథాలయ అధికారి బి. రవి కుమార్ నాయుడు ఆధ్వర్యంలో ఎంఈఓలు వై.నాగరాజు సి.రామ గోవిందరెడ్డి జాతీయ గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రికలు విడుదల చేశారు. తాడిపత్రి శాఖా గ్రంథాలయంలో ఈనెల నవంబర్ 14వ తేది నుండి 20వ తేది వరకు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తారన్నారు. ఈ వారోత్సవాలలో 14వ తేదీ ప్రారంభ వేడుకలు 15వ తేదీ పుస్తక ప్రదర్శన 16, 17, 18, 19వ తేదీలలో వివిధ అంశాలలో విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి బహుమతి ప్రధానం చేస్తారన్నారు.

విశాలాంధ్ర-పామిడి : గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని గ్రంథాలయాధికారి వెంకట లక్ష్మి తెలిపారు. గ్రంథాలయాలు అందిస్తున్న సేవలను ప్రజలకు తెలియజేస్తామన్నారు.

నేటి నుంచి వారోత్సవాలు

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: బొమ్మనహాళ్ శాఖ గ్రంథాలయంలో గురువారము నుండి 20వ తేదీ వరకు, విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ప్రసాద్ తెలిపారు. బుధవారం వారోత్సవాలు గోడపత్రికలు విడుదల చేశారు. 14వ తేదీన బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, మాదక ద్రవ్యాల పై అవగాహన, 16న గ్రంథాలయం ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖుల ను స్మరించుకోవడం, 17న కవి సమ్మేళనాలు, రచయితల సందేశాలు,18న విద్యార్థులకు చిత్రా లేఖనం, వ్యాసరచన పోటీలు, 19న మహిళలకు, రంగవల్లి అల్లికలలో పోటీలు ఉంటాయి.

చివరి ఆయకట్టుకు సాగునీరు అందివ్వండి..

విశాలాంధ్ర-తాడిపత్రి : నియోజకవర్గంలోని చివరి ఆయకట్టుకు సాగునీరు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తాడిపత్రి ఎమ్మెల్యే జెసి. అస్మిత్‌రెడ్డి బుధవారం అమరావతిలోని నీటి పారుదల శాఖ సచివాలయంలో ఎమ్మెల్యే నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడిని కలసి చివరి ఆయకట్టుకు సాగునీరు అందివ్వాలని కోరారు. పెండెకల్లు రిజర్వాయర్ దిగువ ఉన్నటి వంటి పూర్తి కానీ కాల్వలను త్వరితిగతిన పూర్తి చేయాలంటన్నారు. ఈ కాల్వ పూర్తి అయితే పెండేకల్లు మొదలుకొని తాడిపత్రి మండలం బోడాయిపల్లి గ్రామం వరకు సాగునీరు అందించవచ్చునని మంత్రికి వివరించారు. మంత్రి నిమ్మల రామానాయుడు స్పందిస్తూ వాటికి ఉన్న అడ్డంకులను తొలిగించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. అదేవిధంగా తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి బుధవారం సౌత్ కెనాల్‌కి నీరు వచ్చే తుంపెర సెటర్ వద్ద టీడీపీ నాయకులు, అనుచరులతో కలిసి పర్యటించి అక్కడ నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న ముళ్ల పొదలు, పూడికతీత తీసే విధంగా చర్యలు తీసుకున్నారు.

మాజీ ఎంపీ తలారి రంగయ్యపై అసత్య కథనాలు ఆపండి

విశాలాంధ్ర-శెట్టూరు: కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండే నాయకుడు కళ్యాణదుర్గం నియోజకవర్గ వైయస్సార్ సీపీ సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య మీద టివి9 ప్రసారం చేసిన అసత్య కథనాలను ప్రచారం చేయడం తగదని వైసిపి మండల నాయ కులు హితవు పలికారు. బుధవారం ఎంపీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లా డుతూ తలారి రంగయ్య ఎన్నికల ఫలితాలు వెలువడి 24 గంటలు కూడా గడవకముందే కళ్యాణదుర్గం పార్టీ కార్యాల యంలో కార్యకర్తలకు అందుబాటులో ఉండి, నైతిక స్థైర్యాన్ని, భరోసాను కల్పించారన్నారు. ఎన్నికల ఫలితాలు అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు గ్రామాల్లో వైసీపీ నాయకుల మీద దాడులకు పాల్పడితే ప్రతి కార్యకర్త దగ్గరకి వెళ్ళి వాళ్లకు ధైర్యం చెప్పి మీరెవరు భయపడకండి మీకు పార్టీ తరఫున నేను అండగా ఉంటానని భరోసా కల్పించారు. టీడీపీ నాయకుల దాడిలో గాయపడ్డ వారికి, ఎన్నికల ఫలితాలు చూసి భావోద్వేగానికి గురై మరణించిన కుటుంబాలకు రాష్ట్రంలో ఏ నియోజకవర్గంలో లేనంతగా ఎక్కువమందికి పార్టీ నుండి ఆర్థిక సహాయం అందేలా చేశారని తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకుల ఆదేశాల ప్రకారం పోలీసులు ఆంక్షలు పెట్టి, అడుగడుగునా అడ్డుపడినా పార్టీ కార్యకర్తలను కలిసి వారికి ధైర్యం చెప్పారన్నారు. పార్టీ అధ్య క్షులు, జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాపాలను ప్రక్షాళనకు చేసిన దీక్ష కార్యక్రమం రాష్ట్రంలో ఎక్కడా లేనంత భారీ స్థాయిలో తలారి రంగయ్య నాయకత్వంలో కళ్యాణదుర్గంలో జరిగిందన్నారు. ఆదరణను చూసి తట్టుకోలేక టీడీపీ నాయకులు పోలీసులు మీద ఒత్తిడి చేసి కేసులు పెట్టించిన సంగతి టీవీ 9 చానెల్ వారికి కనబడలేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ సోమనాథ రెడ్డి, వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప,బీసీ సెల్ మండల కన్వీనర్ తిప్పేస్వామి, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి యం.యస్.హనుమంత రాయుడు,కో ఆప్షన్ సభ్యులు మన్సూర్, సర్పంచులు గంగన్న, నాగరాజు, మాజీ సర్పంచ్ వీరభద్రప్ప, సేవాదల్ శ్యామ్ సుందర్ చౌదరి, వార్డు మెంబర్ లింగమయ్య, మాజీ డీలర్ వన్నూరుస్వామి, నాయకులు యాదవ గోపీ, నాగరాజు,శీనప్ప పాల్గొన్నారు.

ఎస్సీల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించడం హర్షణీయం

విశాలాంధ్ర-రాప్తాడు: రాష్ట్రంలో ఎస్సీ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఏపీ బడ్జెట్లో రూ.18,497కోట్లు కేటాయించడంపై ఎస్సీ సెల్ మండల కన్వీనర్ పాలచెర్ల ముత్యాలప్ప, రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గంజి నరేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం టీడీపీ మండల కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుబాటి శీనాతో కలిసి రాప్తాడులో అంబేద్కర్, సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే పరిటాల సునీత చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో ఎస్సీలను నిర్లక్ష్యం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఎస్సీల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు.

సూపర్ సిక్స్ పేరుతో సూపర్ చీటింగ్

విశాలాంధ్ర-అనంతపురం రూరల్ : సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బడ్జెట్ సందర్భంగా ప్రజలకు 'సూపర్ మోసం' చేసిందని అనంతపురం కాంగ్రెస్ ఇంచార్జ్ దాదా గాంధీ మండిపడ్డారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ... మేనిఫెస్టోలో ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం కింద పెట్టుబడి సాయంగా ఏటా రూ.20 వేలు ఇస్తామని చెప్పి.. బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు చేశారని విమర్శించారు. వాస్తవానికి రూ.10 వేల కోట్లకు పైగా నిధులు అవసరం అవుతుంటే రూ.4500 కోట్లు మాత్రమే కేటాయింపులు చేసి రైతాంగాన్ని మోసం చేశారని తెలిపారు. ఇక ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి పథకాల ఆచూకీ కనిపించలేదన్నారు. బడికి వెళ్లే ప్రతి పిల్లాడికి రూ.15 వేలు ఇస్తామన్నారని, కానీ బడ్జెట్‌లో తల్లికి వందనం పథకానికి కేవలం రూ.2491 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్న హామీ కూడా అటకెక్కిందన్నారు. అతివృష్టి అనావృష్టి వల్ల నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకోవాలని, హెచ్ ఎల్ సి ఆధునీకరణ పనులు వెంటనే చేపట్టాలని, పీఏబీఆర్ కుడి కాల్వ ద్వారా 49 చెరువులు నింపి చివరి ఆయకట్టుకు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రాయితీ వేరు శనగ పంపిణీ

విశాలాంధ్ర-కూడేరు: వర్షాభావం వల్ల వేరుసెనగ వేయని మండల రైతులకు వ్యవసాయశాఖ ద్వారాబుధవారం వ్యవసాయశాఖ ద్వారా కూడేరు రైతు సేవా కేంద్రంలో సర్పంచి శ్రీమతి లలితమ్మ, మండల వ్యవసాయ అధికారి విజయ కుమార్, మండల అభివృద్ధి అధికారి కుళ్ళాయిస్వామి, ద్వారా రాయితీపై వేరుశెనగ విత్తన పంపిణీ ప్రారంభించారు. వ్యవసాయ అధికారి విజయకుమార్, ఏఈఓ శైలజ వి హెచ్ఏ సాజియ పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

విశాలాంధ్ర-ఆత్మకూరు: ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం జరిగింది. డిఆర్డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ ఈశ్వరయ్య, మండల పరిషత్ అధ్యక్షులు హేమలత, ఎంపీడీవో జి లక్ష్మీనరసింహ, వైస్ ఎంపిపి పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ముఖ్య ఉద్దేశం అందరికీ సామజిక న్యాయం, ఆర్థికంగా అభివృద్ధి చెందడం. ప్రజలందరిని, అన్ని వర్గాల వారిని, సంఘాల వారిని భాగస్వాములు చేసి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేసినప్పుడే అందరికీ ఉపయోగపడుతుందన్నారు. అన్ని వర్గాల వారిని భాగస్వాము లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు పంచాయతీ సర్పంచ్ లు, రిసోర్స్ పర్సన్లు మహబూబ్ బాషా మల్లేష్, ప్రభాకర్, మానస కాత్యాయని పాల్గొన్నారు.

ఆహుడా చైర్మన్‌కు ఘన స్వాగతం పలుకుదాం

విశాలాంధ్ర-శింగనమల: జనసేన నేత ఆహుడా చైర్మన్ గా ఎన్నికై మొదటిసారి జిల్లా పర్యటనకు విచ్చేయుచున్న టీసీ వరుణ్‌కి ఘన స్వాగతం పలుకుదామని శింగనమల నియోజకవర్గ ఇన్చార్జ్ సాకే మురళి కృష్ణ, జిల్లా కార్యదర్శి బొమ్మన పురుషోత్తం రెడ్డి జనసేన నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ గురు వారం ఉదయం 10 గంటలకు కల్లూరు బైపాస్ సర్కిల్ వద్దకు శింగనమల నియోజకవర్గ జనసేన పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మండల అధ్యక్షులు జన సైనికులు వీర మహిళలు మన ప్రియతమ జనసేన నాయకుడు, టి.సి.వరుణ్ అహుడా చైర్మన్‌గా ఎన్నికై మొదటిసారి జిల్లాకు విచ్చేయుచున్న సందర్భంగా ఆయనకు ఘనస్వాగతం పలకాలన్నారు.

రికార్డులు పరిశీలించిన మలేరియా అధికారి

విశాలాంధ్ర-యాడికి: చుక్కులూరు వన్ సచివాలయం లోని ఏఎన్ఎం రికార్డులు పరిశీలించి ప్రతిరోజు తప్పగా రక్తపూతలు తీయమని బుధవారం తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సిబ్బందికి తెలిపారు. తీసిన రక్తపూతలను ప్రతిరోజు చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్ కు పంపాలని ఆరోగ్య సిబ్బందికి తెలియజేశారు. ఒకవేళ జ్వరము ఎక్కువగా ఉన్నచో ఆరోగిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలని తెలిపారు గర్భవతులకు బాలింతలకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి డ్రైడే ఫ్రైడే గురించి వివరించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, ఎంపిహెచ్ఓ బాల సూర్యనారాయణ,సూపర్వైజర్ ఎంపీ నారాయణ ల్యాబ్ టెక్నీషియన్ జ్యోతి, ఏఎన్ఎం ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-కణేకల్లు: కనేకల్లు చెరువు కట్ట రోడ్డులో వెలసిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో కార్తీక మాసం బుధవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు వినయ్‌కుమార్ తెలిపారు. ఉదయాన్నే గంగా పూజ నేయాభిషేకం పంచామృత అభిషేకం నిర్వహించారు. సాయంత్రం శ్రీ అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తిని ఆలయము చుట్టూ ప్రాకార ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి సుధాకర్ మణికంత తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయిబాబు జన్మదిన వేడుకలకు సీఎంకు ఆహ్వానం

విశాలాంధ్ర-పుట్టపర్తి: భగవాన్ శ్రీ సత్య సాయి బాబా 99వ జన్మదిన వేడుకలకు ప్రత్యేకంగా ప్రభుత్వం తరపున హాజరుకావాలని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఆర్జే రత్నాకర్ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డిలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఆహ్వానించారు. అమరావతిలోని ముఖ్యమంత్రి ప్రత్యేక ఛాంబర్‌లో బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌తోపాటు పుట్టపర్తి నియోజక వర్గం ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, పుట్టపర్తి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలతో కలిసి ముఖ్యమంత్రిని ప్రత్యేకంగా కలిసి ఈ నవంబర్ 23న జరిగే జన్మదిన వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరు కావాలని కోరారు. ఈనెల 22 వరకు అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయని వచ్చే 2025లో నవంబర్ మాసంలో జరిగే సత్యసాయి శతాబ్ది జన్మదిన వేడుకలను ప్రభుత్వం ఆధ్వర్యంలో

రాష్ట్ర పండుగలా గుర్తించి నిర్వహిస్తామని ఆ కార్యక్రమానికి పుట్టపర్తికి తప్పకుండా హాజరవుతానని సత్యసాయి ట్రస్ట్ సభ్యులు రత్నాకర్ ,మంత్రి సత్యకుమార్ ,స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డికి సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరపున తగిన ఏర్పాట్లు చేసే విధంగా జిల్లా యంత్రాంగంతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని సత్యసాయి ట్రస్టు సభ్యులకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-పుట్టపర్తి: నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ టిఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు .బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ ఎస్ సమావేశ మందిరంలో డీడబ్ల్యూఎంఏ పంచాయతీరాజ్ శాఖ ఎస్సీఈ, డీఈలు, ఏఈఓలు, డిడబ్ల్యూఎం ఏపీఓలతో, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధక శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. డిడబ్ల్యూఎం ఏపీడీ విజయేంద్రప్రసాద్, పంచాయతీరాజ్ శాఖ ఎస్సీ మురళీకృష్ణ, పట్టు పరిశ్రమ శాఖ జీడి పద్మావతి, పశుసంవర్ధక శాఖ జైడి శుభదాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీఈలు క్షేత్రస్థాయిలో తిరిగి అభివృద్ధి పనులు సంబంధించిన పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. పుట్టపర్తి, మడకశిరి క్లస్టర్లు పంచాయతీరాజ్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పుట్టపర్తి, ఆమడగూరు, నల్లమాడ మండలాల్లో వెండర్ ఖరారు పనుల పురోగతి శూన్యం. పురోగతిని మెరుగుపరచండి లక్ష్యాన్ని సాధించండి అన్నారు.

పెండింగ్‌లో ఉన్న అన్ని 100 శాతం పనులను పూర్తి చేయాలి. డిఈఈ లు ఏఈలందరికీ ఇదే చివరి హెచ్చరిక అన్నారు. వివిధ పనులు అమలు చేయడం లో నియోజకవర్గాలలో గ్రౌండింగ్ మడకశిర పుట్టపర్తి డివిజన్ చాలా వెనకబడి ఉన్నాయి వాటిని పురోగతిలో తీసుకొని రావాలని ఇంజనీర్ల హెచ్చరించారు పనుల పురోగతిని ఆడిట్ చేయండి. సీసీ రోడ్డు పని నాణ్యతగా ఉండాలని, నాణ్యత లేని రోడ్లు నిర్మించి నా దృష్టికి వస్తే సంబంధిత ఏఈ నుంచి తిరిగి రికవరీ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. నియోజకవర్గాల వారీగా పిఆర్ పనులు పురోగతిలో ఉండాలని తెలిపారు. బిటి రోడ్లు మొత్తం 21 కి.మీ పనులు మంజూరయ్యాయి కానీ 0.5 కి.మీ పూర్తయింది. మంజూరైన పనులన్నీ పూర్తి చేయాలన్నారు. కాంపౌండ్ వాల్స్ పరిగి, గోరంట్ల, చిలమత్తూరు మండలాల పనుల పురోగతి శూన్యం అన్నారు. మీ డివిజన్ స్థాయి అన్ని పిఆర్ పనులకు అన్ని డీఈలు మీరే బాధ్యులు అన్నారు.

గురుకుల పాఠశాల భవన నిర్మాణం చేపట్టండి ..

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రికి ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ లేఖ

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరంలో మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల భవన సముదాయ నిర్మాణానికి సంబంధించిన పనులు చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మంగళవారం లేఖ రాశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గంలో అత్యధిక వెనుకబడిన తరగతుల విద్యార్థులు నివసిస్తున్నారని, వీరు గురుకుల పాఠశాలలో విద్యాభ్యసించాలంటే సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జీవో నెంబర్ 12 ద్వారా ధర్మవరానికి మంజూరైన మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రారంభించడానికి అనుగుణంగా భవన నిర్మాణాన్ని ఏర్పాటు చేసేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రిను కోరడం జరిగిందన్నారు.పాఠశాల నిర్మాణం కోసం గతంలో కేటాయించిన రూ.36 కోట్ల నిధులకు అదనంగా తాజా అంచనాలకు అనుగుణంగా నిధులు కేటాయించి వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించాలన్న కూటమి ప్రభుత్వ ఆకాంక్షను నెరవేర్చాలని కోరారు.

వాల్మీకి బోయ కార్పోరేషన్‌ను బోయ కులస్థులకే కేటాయించాలి

విశాలాంధ్ర-అగళి : వాల్మీకి బోయ కార్పోరేషన్‌ను బోయ కులస్థులకే కేటాయించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ సుబ్బారావు కు వినతిపత్రం అందించారు. సత్యసాయి జిల్లా ఏపీ వి బి ఎస్ సంఘం ఆధ్వర్యంలో బోయ కార్పోరేషన్ చైర్మన్ పదవి బోయజాతి వారికే ఇవ్వాలని ఈ విషయం ప్రభుత్వానికి తెలియజేయాలని అగలి మండల తహసీల్దార్ కు వినతి పత్రం అందించి తమ వ్యతిరేకతను తెలియ జేసారు. ఏపీ వి బి ఎస్ జిల్లా నాయకులు ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం అంతరాష్ట్ర కోఆర్డినేటర్ మంజునాథ్ వైస్ ఎంపీపీ హేమంతరాజు అలుడి గిరీష్ రాజు రంగా ఆర్ మంజునాథ్ వాల్మీకి సెక్రటరీ భూతన్న నాయక భీమన్న నాయక రామ నాయక తదితరులు పాల్గొన్నారు.

బూదిలి హైస్కూల్‌కు పేరు మార్పు

విశాలాంధ్ర-గోరంట్ల: మండలంలోని బూదిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేరును గతంలో మాదిరిగానే శ్రీశైల నిడిమామిడి జగద్గురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా పేరు మార్చినట్లు ఇకనుండి.. రికార్డులలో నమోదుతో పాటు పిలవాలని జిల్లా అధికారి ఆదేశాల మేరకు మండల విద్యాధికారులు జాను రెడ్డప్ప గోపాల్‌లు బుధవారం పాఠశాల హెచ్‌ఎం లకు ఉత్తర్వుల కాపీని అందజేశారు. గతంలో దాతలు సేవా ట్రస్ట్ సేవల మేరకు శ్రీశైల నిడిమామిడి జగద్గురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా ఉన్న సందర్భంలో ఇటీవల కొన్నేళ్లుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా రికార్డులలో మార్పు చేయడంతో గ్రామస్తులతో పాటు బసవేశ్వర కులస్తులు విద్యా శాఖ మంత్రి నారాలోకేష్ మంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథిల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు విద్యాశాఖ అధికారులకు జరిగిన విషయాలపై తెలపడంతో గతంలో మాదిరిగానే శ్రీశైల నిడిమామిడి జగద్గురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బూదిలిగా మార్పు చేస్తూ ఎంఈఓకు ఉత్తర్వులు జారీ చేశారు,

నేత్రదానం చేసిన వృద్ధుడు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని శాంతి నగరకు చెందిన మచ్చా వెంకటేశ్వర్లు (74) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు విశ్వదీప సేవా సంఘానికి సమాచారం అందించగా, వారు కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించి జిల్లా అంతత్వ నివారణ సంస్థ, హైదరాబాద్ ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ శ్రీకాంత్ ద్వారా నేత్రాలను స్వీకరించారు. సహకరించిన దాత కుమారులు రాంబాబు, తేజ మూర్తి, కూతురు సువర్ణ, అల్లుడు విజయ సారధికు విశ్వ దీప సేవా సంఘం వారు కృతజ్ఞతలను తెలియజేశారు. ఉపాధ్యక్షులు శేఖర్ రెడ్డి,వెంకటేష్, రఘు, మాధవ, అక్కులప్ప పాల్గొన్నారు.

హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు రూ.822 కోట్ల కేటాయింపు హర్షణీయం

విశాలాంధ్ర-గుడిబండ : ఉమ్మడి అనంతపురం జిల్లాకు జీవనాడి అయిన హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టుకు ఈఏడాది బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం 822 కోట్ల రూపాయలను కేటాయించడాన్ని స్వాగతిస్తున్నామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి అన్నారు. బుధవారం ఆయన

మాట్లాడుతూ కరువు జిల్లా రైతాంగం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ ధన్యవాదాలు తెలిపారు. గత వైకాపా ప్రభుత్వం రాష్ట్రంలో సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, నవ్యాంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత చంద్రబాబునాయుడు ఐదేళ్లలో సాగునీటి రంగానికి దాదాపు 68 వేల కోట్లు ఖర్చు చేయగా వైకాపా ప్రభుత్వం దాదాపు 37 వేల రూపాయలు మాత్రమే ఖర్చు చేశారని తెలిపారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు 35 సార్లు, నీటిపారుదల శాఖ మంత్రిగా దేవినేని ఉమా 40 సార్లు అనంతపురం జిల్లాలో పర్యటించారని, ఒకసారి కూడా ముఖ్యమంత్రి హోదాలో జగన్ హంద్రీనీవా ప్రాజెక్టు పురోగతిని సమీక్షించలేదని అన్నారు.మరోవైపు వరదల సమయంలో ప్రతి ఏటా కృష్ణా నది ద్వారా వందల టిఎంసిల జలాలు సముద్రంలో వృథాగా కలిసిపోతున్నాయని, హంద్రీనీవా ప్రధాన కాలువ వెడల్పు చేసి,కాంక్రీట్ లైనింగ్ వేసి డిస్ట్రిబ్యూటరీ లను నిర్మిస్తే ఉమ్మడి జిల్లాలో 3.45 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని,హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు ప్రారంభించింది చంద్రబాబు నాయుడు మాత్రమేనని తెలిపారు.

గ్రామసభలో పలు సమస్యల వెల్లువ

విశాలాంధ్ర-తలుపుల : ఓదులపల్లి పంచాయతీలో గ్రామ సభ ఏర్పాటు చేశారు. తాహసిల్దార్ రెడ్డి శేఖర్ మాట్లాడుతూ గ్రామంలో మీ భూములు సమస్యలు పరిష్కారం కోసం మేము పని చేస్తామని తెలిపారు. పన్నార్స్ రవి మాట్లాడుతూ మా పంచాయతీ లో భూములు చాలా తారుమారు ఉన్నాయి వాటిని సరిదిద్దాలని, అలాగే చాలా కాలం నుంచి హంద్రీనీవా కాలువకు దాటుటకు రైతులకు మరియు పశువుల కాపరులకు పోవడానికి చాలా ఇబ్బంది పడుతున్న విషయం తెలిపాము. బ్రిడ్జి నిర్మాణం చేపడితే మాకు బాగుంటుంది అన్నారు. టీడీపీ నాయకులు పన్నార్స్ రవి, సత్యసాయి జిల్లా ఎస్టీ వైఎస్ఎస్ ఉపాధ్యక్షుడు ఇట్ట జేజప్ప, గోసల చిన్న బానుగుట్టు, ఇట్ట జయరాం రాజారెడ్డి, ప్రతాప్, హెచ్ మహబూబ్, బాషా, పాల్గొన్నారు.

ఎస్ఐ చొరవతో రహదారి శుభ్రం

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు : ఎస్ఐ మల్లికార్జున రెడ్డి చొరవతో మండల కేంద్రంలోని కదిరి - హిందూపురం ప్రధాన రహదారి పరిశుభ్రమైంది. ప్రధాన రహదారిపై పారుతున్న మురుగునీరు, మట్టిదిబ్బలతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యపై స్పందించిన ఎస్ఐ బుధవారం యంత్రాలతో రోడ్డుపై పేరుకు పోయిన మట్టిదిబ్బలు తీయించారు. ఎస్ఐ స్పందనపై పలువురు స్థానికులు వ్యక్తం చేశారు. ఏఎస్ఐ కిశోర్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-పెనుకొండ: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ ఆధ్వర్యంలో జిల్లాలో వున్న నిరుద్యోగ యువతీ యువకులు కొరకు ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, మడకశిర రోడ్డు, పెనుకొండలో 1వ తేదీన జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల వైస్ ప్రిన్సిపల్ జయప్ప, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ బుధవారం ఓ సంయుక్త ప్రకటనలో తెలియజేశారు. 3 కంపెనీల కోసం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ, ఇంటర్, డిప్లమో, డిగ్రీ, పూర్తి చేసి 18 నుంచి 30 సంవత్సరలులోపు ఉన్న వారు అర్హులు అని తెలియజేశారు. నెలకు రూ.12 వేల నుంచి రూ.20వేల జీతం ఉంటుంది

అంగన్వాడీ కేంద్రానికి సామగ్రి వితరణ

తల్లిపాలే ముద్దుడబ్బా పాలు వద్దు ..సిడిపిఓ రాధిక

విశాలాంధ్ర-కదిరి: సృష్టి ఆరంభం అమ్మతోనే ప్రారంభం అయినదని,అమ్మ లేకపోతే సృష్టి లేదని,అ అంటే అనురాగం మా అంటే మమకారం అని ఎలాంటి స్వార్థం తోను ఉండక నిశ్వార్థంగా తన ప్రేమతో నవ మాసాలు బిడ్డను మోసిన అమ్మకు దేవతలు సైతం తల వంచి నమస్కారం చేస్తారని సిడిపిఓ రాధిక పేర్కొన్నారు. బుధవారం రూరల్ పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి అంగన్వాడీ కేంద్రంలో క్రెడిట్ ఆక్సిస్ గ్రామీణ లిమిటెడ్ వారిచే 30 వేల రూపాయల విలువ చేసే చిన్నపిల్లల 80 కుర్చీలు,10 జంకానాలు ఏరియా మేనేజర్ ఆదినారాయణ బ్రాంచ్ మేనేజర్ రాజేష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. తమ బ్యాంకు ద్వారా వచ్చిన లాభాలను కొంతమేర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటామని వారు తెలిపారు.ఈ సందర్భంగా సీడిపిఓ గర్భవతులకు బాలింతలను ఉద్దేశించి మాట్లాడుతూ పిల్లలు పోషకాహార లోపానికి గురి కాకూడదని చిరుధాన్యాలలో ఎన్నో పోషక విలువలు ఉంటాయని,పుట్టిన గంటలోపు

ముర్రు పాలు ఇవ్వాలని, ఆరు నెలల వరకు తల్లి పాలు ఇవ్వడం వలన భవిష్యత్ లో పిల్లలకు నిమోనియా,అతి సార, మధుమేహం మొదలగు ప్రమాదకర వ్యాధుల నుండి కాపాడుకోవచ్చని సలహాలు చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ రామలక్ష్మి, సువర్ణ,నీలావతి, లక్ష్మిదేవిబాలింతలు, గర్భవతులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రణాళిక

విశాలాంధ్ర-ముదిగుబ్బ: ముదిగుబ్బ మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు రాష్ట్ర కూటమి ప్రభుత్వం చేపట్టిన గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణ 2025-26 కార్యక్రమానికి మండల అధ్యక్షులు గొద్దుమర్రి ఆదినారాయణ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని గ్రామాలన్నిటిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవడమే మన ధ్యేయమని ఎంపీపీ అన్నారు. మండల స్థాయి గ్రామస్థాయి అధికారులందరూ ప్రజలతో కలిసి వారికి కావలసిన మౌలిక సదుపాయాలను ప్రజలకి అడిగి తెలుసుకొని ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ముదిగుబ్బ మండల వైస్ ఎంపీపీ వెంకటరెడ్డి , ముదిగుబ్బ మండల అధికారులు ఎంపీడీఓ విజయ్ భాస్కర్, పంచాయతీ సెక్రటరీ మంజులదేవి , పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

అధికారుల సమన్వయం ఉండాలి

విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు: అధికారుల సమన్వయంతో తీసుకున్న నిర్ణయాలు ప్రజల సమస్యలు పరిష్కారం కాగలవని ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 2024-25 ఏడాదిలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జిపిడిపి) పై వివిధ శాఖల మండల స్థాయి అధికారుల సమన్వయ పాలన పై ప్రత్యేక సమావేశం జరిగింది. ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, తహశీల్దార్ అనంతాచారి మాట్లాడుతూ... ప్రజల అవసరాలకు జిపిడిపి ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. నోకాస్ట్, లోకాస్టో చిన్న సూచనలతో పెద్ద సమస్యలు పరిష్కారం అవుతాయని అన్ని శాఖల అధికారుల సమన్వయం ఎంతో అవసరం అన్నారు. ఈవోపీఆర్డి కేశవరెడ్డి, ఏఓ రమణ నాయక్, అంగన్వాడీ సూపర్వైజర్ విజయ కుమారిహాజరయ్యారు.

గ్రామపంచాయతీని అభివృద్ధి పరచుకోవాలి

విశాలాంధ్ర -అగళి : ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేసి గ్రామపంచాయతీలను అభివృద్ధి పరచుకోవాలని ఎంపిడిఓ యాదవేంద్ర శిక్షకులు ఫణిరాజు పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లు ఎంపీటిసిలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయితీ కార్యదర్శి ఫణిరాజు శిక్షకులుగా వ్యవహరించారు.సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని, గ్రామ సభలు నిర్వహించి, అన్ని అను బంధ శాఖల అధికారులు పూర్తిగా పాల్గొని, ప్రజలందరి భాగ స్వామ్యంతో జిపిడి పి తయారు చేయాలని కోరారు.

మాకు ఈ ఉపాధ్యాయుడు వద్దు మహా ప్రభో

విశాలాంధ్ర-పుట్టపర్తి : పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 18 వ వార్డు బడేనాయక్ తాండలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు శంకర్ నిత్యం మద్యం మత్తులో పాఠశాలకు వస్తున్నారు. బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఆ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు ఆర్.ఉమాదేవి భాయ్ మాట్లాడుతూ గత కొంతకాలంగా ఉపాధ్యాయుడు శంకర్ మద్యం మత్తులో పాఠశాలకు వస్తున్నాడన్నారు. ప్రతినెల 1వ తేదీ నుంచి 5వ తారీఖు వరకు పాఠశాలకు రాడని సమీపంలోనే తన నివాసం ఉండడంతో ఫేస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేస్తున్నాడన్నారు. ఇలాంటి ఉపాధ్యాయులు వల్ల విద్యార్థుల జీవితం నాశనం అవుతుందని చైర్మన్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులను అడుగగా ఉపాధ్యాయుడు మద్యం సేవించి పాఠశాలలో నిద్రిస్తాడని, అలాగే ప్రతి ఒక్కరికి ఐదు రూపాయలు చొప్పున డబ్బులు ఇచ్చి ఎవరైనా వచ్చి అడిగితే తాను లేడని మీటింగుకు వెళ్లాడని చెప్పమంటున్నాడన్నారు. ప్రస్తుతం అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు వెంకటనాయుడు మాట్లాడుతూ, తాను, శంకర్ నాయక్ గతంలో ఈ పాఠశాలలో విధులు నిర్వహించే వారని, ప్రస్తుతం సర్ ప్లేస్ పద్ధతిలో తనను మున్సిపాలిటీలోని కర్ణాటకనాగేపల్లికి బదిలీ చేశారని అయితే ఎంఈఓ ఖాదర్ వలీ ఆదేశాల మేరకు ప్రస్తుతం తాను ఇక్కడికి వచ్చి పిల్లలకు ఎలాంటి ఆటంకం జరగకుండా విధులు నిర్వహిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఎంఈఓ ఖాదర్ వలీని వివరణ కోరగా సదరు ఉపాధ్యాయుడు శంకర్ నాయక్ పై ఇదివరకే ఆరోపణలు రావడంతో నివేదికలు సిద్ధం చేసి డిఇఓకు రిపోర్ట్ పంపామన్నారు. ఇప్పుడు మరోసారి ఆరోపణలు రావడంతో రెండవసారి రిపోర్ట్ పంపుతున్నామన్నారు.

స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కాడిశెట్టి శ్రీనివాసులు

విశాలాంధ్ర-పెనుకొండ: ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పెనుకొండ మండల ఉపాధ్యాయుడు కాడిశెట్టిశ్రీనివాసులుఎన్నికయ్యారు.విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఇరవై నాలుగు సంవత్సరాలుగా ఉపాధ్యాయ సంఘ నాయకుడిగా జిల్లా, రాష్ట్ర స్థాయి లో వివిధ హోదాల్లో పని చేశారు. అదేవిధంగా రొద్దం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు యం.వి. కృష్ణారెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. వీరి ఎంపిక పట్ల పెనుకొండ డివిజన్ ఉపాధ్యాయులు.శ్రీనివాసులు, కిష్టప్ప, నాగశేఖర్, విజయకుమార్ నాయక్, డి.శ్రీనివా సులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల అల్పాహారానికి దాతల విరాళం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణములోని సంజయ్‌నగర్‌లో గల పొరపాలక బాలికల ఉన్నత పాఠశాల కొన్నేళ్లుగా పదో తరగతి ఉత్తీర్ణతలో నూటికి నూరు శాతం ఫలితాలను అందిస్తూ, పట్టణంలో మంచి గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ ఉమాపతి తనదైన శైలిలో డీఈఓ ఆదేశాల మేరకు పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం పూట అదనపు తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ అదనపు తరగతులు నిర్వహణకు ఏదో కొంత అల్పాహారం ఇవ్వాలన్న తలంపుతో గత కొన్నేళ్లుగా దాతల సహకారంతో విద్యార్థినీలకు అల్పాహారాన్ని ఇవ్వగలుగుతున్నారు. దాతలు బాబావాలి, హరీష్ ,పార్థ, శివప్రసాద్, చౌడయ్య, హేమ్రాజ్, వెంకట్ నారాయణ, శివ అనే దాతలు తమ వంతుగారూ .10,500 విరాళంగా హెడ్మాస్టర్ ఉమాపతికి అందజేశారు. విద్యార్థినీలు మంచి ఉత్తీర్ణత సాధించాలన్న తలంపుతోనే ఈ విరాళం ఇవ్వడం జరిగిందని తెలిపారు. హెడ్మాస్టర్ ఉమాపతి దాతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలను తెలియజేశారు

విద్యార్థినిలకు భోజన పంపిణీ నా అదృష్టం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల 430 మంది విద్యార్థినిలకు తన వంతుగా భోజన పంపిణీ చేయడం నా అదృష్టంగా భావిస్తానని లాయర్ గుంటప్ప తెలిపారు. తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విరాళంగా నగదును ఇచ్చి, భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగిందని అధ్యక్షులు చిన్న తంబి చిన్నప్ప తెలిపారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ లాయర్ గుంటప్పకు, కళాశాల చైర్మన్ బండి వేణుగోపాలకు, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

15న సాంస్కృతి కార్యక్రమాలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని సంజయ్ నగర్ లో గల బి ఎస్ ఆర్ బాలికల ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 15వ తేదీ శుక్రవారం రాత్రి 9 గంటలకు కోజా గిరి ఉత్సవం నిర్వహించనున్నట్లు కార్యవాహ అన్నం అరవింద్ తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వివిధ రకాల ఆటలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

పదోన్నతులు పూర్తి చేయాలి



విశాలాంధ్ర-ధర్మవరం: మునిసిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు వెంటనే పూర్తి చేయాలని ఏపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ వివిధ కారణాల చేత ఇప్పటికే ప్రకటించిన పురపాలక ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ ఆగిపోయిన నేపథ్యంలో తిరిగి ఆ పక్రియను వెంటనే పూర్తి చేసి పురపాలక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డి ఎ, సంపాదిత సెలవులు, ఇతర బకాయిలను వెంటనే చెల్లించాలని, 30 శాతము ఐఆర్ ప్రకటించాలని, ఉపాధ్యాయులపై బోధనేతర భారం తగ్గించాలని, డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధించాలని కోరారు. తెలిపారు. పట్టణ శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, జగదీష్ మాట్లాడుతూ అపార్ గడువు పొడగించి ప్రధానోపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలని, జీవో 117ను రద్దుచేసి పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. గౌరవ అధ్యక్షులు జెన్నె నాగప్ప ఉపాధ్యాయులు బషీర్ అహమ్మద్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో గల ప్రధాన పౌర శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి, పాఠకులు, సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంజలి సౌభాగ్యవతి మాట్లాడుతూ ఈ గ్రంథాలయ వారోత్సవాలు 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు ఏడు రోజులపాటు పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తామని, ఇందులో భాగంగా జూనియర్ విభాగంలో ఆరవ, ఏడవ, తరగతి లకు, అదేవిధంగా సీనియర్ విభాగములో ఎనిమిదవ, తొమ్మిదవ, పదవ తరగతి లకు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. మంచి ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఈనెల 20వ తేదీన బహుమతులను అందజేస్తామని తెలిపారు. తదుపరి 14వ తేదీన బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖులు, 17న కవి సమ్మేళనం, 18న చిత్రలేఖనం, 19న ఉమెన్స్ డే, 20న గ్రంథాలయ దే నిర్వహిస్తామన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

విశాలాంధ్ర-ధర్మవరం : పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో (వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా) రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలలోని 163 మందికి రక్త పరీక్షలను నిర్వహిస్తామని అధ్యక్షులు జయసింహ తెలిపారు. క్యాంపు దాతగా క్లబ్బు ఉపాధ్యక్షులుగా నరేంద రెడ్డి సహాయ సహకారాలు అందిస్తామని ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ నుంచి కార్యదర్శి శివయ్య, సత్య నిర్ధారణ, రోటరీ మెంబర్లు కొండయ్య సహాయ సహకారాలను అందించి తెలిపారు. హెడ్మాస్టర్ శైలజ, హిందీ పండిట్ వేణుగోపాల్ ల్యాబ్ టెక్నీషియన్ హరీష్‌బాబు, అసిస్టెంట్లు సాహితీ సోఫియా, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

In The Court of the Senior Civil Judge Dharmavaram
I.A.No :.165/2024 in O.S.No. : 76/2015
Between :
S.Pullamma And Others
..... Petitioners/Plantiffs
AND
M/S.Bharati Builders Rep by its Mng Partner
Kolli Picchi Reddy and Others
...Respondents/Defendents
Notice to Respondent/ Proposed Party No : 43
***R43 :** Dasari Dhanya Sri D/O Govinda Rajulu, R/at D/No : 9/322/4 Gandhi Nagar Chowdeswari Temple, Dharmavaram Mandal.*
పై నెంబరు కేసులో రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తం 18-11-2024 తేదీ ఉదయం 10.30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైనా ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
P.Lakshmi Narayana, Advocate, Dharmavaram Cell : 9948106576

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

విశాలాంధ్ర-తనకల్లు: విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని ఎస్సై గోపీనాథ్ తెలిపారు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల జడ్పీ హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు ఫోక్సో ఎన్‌డిపిఎస్ చట్టం గురించి తెలిపి వాటి వల్ల కలిగే నష్టాలను వివరించారు. డ్రగ్స్, గంజాయి నివారణ కు సంబంధించినదని యువత అటువైపు వెళ్లకుండా తమ లక్ష్యాలను చేరుకునే విధంగా విద్యాభ్యాసం సాగించాలన్నారు. అమ్మాయిలపై ఎవరైనా అలాంటి చర్యలకు పాల్పడుతుంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చెన్నకేశవ ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు ఖాదర్ వలీ, ఉపాధ్యాయులు పద్మనాభ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, యుగంధర్, పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-మడకశిర: విజయనగరంలో నవంబర్ 27 నుంచి 30వ తేదీ వరకు జరగబోయే ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ తాలూకా కార్యదర్శి ఆర్జీ పవిత్ర ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నరసింహమూర్తి తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభల



గోడ పత్రికలను విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆర్జీ పవిత్ర, నరసింహమూర్తి మాట్లాడుతూ ఆనాడు బ్రిటిష్ పాలకుల ప్రజా వ్యతిరేక పాలనకు ఎదురు తిరిగి భారతదేశానికి స్వాతంత్రం కావాలని బ్రిటిష్ పాలకులను తరిమికొట్టి స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ అని విద్యార్థులకు తెలియజేశారు.

16న చలో అనంతపురం కార్యక్రమం

విశాలాంధ్ర-గోరంట్ల: మూడు దశాబ్దాల మాదిగల ఆకాంక్ష ఎస్సీ వర్గీకరణ సాకారం చేసుకోవడం జరిగిందనీ ఎంఈఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ మధుసూదన్ సాకేత్ తెలిపారు, ఈ నేపథ్యంలో మాదిగల ముద్దుబిడ్డ మందకృష్ణ మాదిగ ఈ నెల 16న ఉమ్మడి అనంతపురం జిల్లా కు విచ్చేస్తున్న సందర్భంగా ఆత్మీయకలయిక మహాసభ విజయోత్సవ ర్యాలీ నిర్వహించి, భారీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇచ్చిన హామీకి కట్టుబడి అందరికీ న్యాయం చేస్తాం.

విశాలాంధ్ర-సోమందేపల్లి.: మండల కేంద్రంలోని అక్కమ్మ కొండ సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీ హరహర అయ్యప్ప స్వామి దేవస్థానం ప్రతిష్ట కార్యక్రమం బుధవారం అయ్యప్ప స్వామి మాలధారణ భక్తులతో ఘనంగా నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హిందూపూర్ పార్లమెంట్ సభ్యులు పార్థసారథి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సగర, ఉప్పర కులస్తులకు కళ్యాణ మండపానికి కేటాయించిన స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలు నేను ఇచ్చిన హామీ మేరకు హిందూపురం రోడ్డు నుండి అక్కమ్మ గార్ల కొండ వరకు సిమెంట్ రోడ్డు వరకు 10 లక్షల రూపాయలు, ఉప్పర సగర కులస్తుల కళ్యాణ మండపం నిర్మాణం కోసం రెండు విడుదలగా 80 లక్షల రూపాయలు కేటాయించామని, బోయ బలిజ వందర్లకు ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీ మేరకు వారి వారి కుల అభివృద్ధి కోసం స్థలాలు కేటాయించి నిర్మాణల కోసం ప్రభుత్వం తరఫున నిధులు మంజూరు చేయిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలోరామచంద్ర, బోర్ గోపాల్, ఎక్స్ ఎంపీటీసీ బాబయ్య, సంజీవరెడ్డి, గుట్టే గోవిందు, అజంతా, పాల్గొన్నారు.

ఒంటరి మహిళలకు ఆర్డీటీ చేయూత...

విశాలాంధ్ర-రొళ్ల: ఒంటరి మహిళలను ఆర్.డి.టి సంస్థ అన్ని రకాలుగా అండగా ఉంటూ ప్రోత్సహించడం సంస్థ ముఖ్య ఉద్దేశమని ఆర్.డి.టి ఆర్.డి మల్లికార్జున ఎ.టి.యల్ ఓబులేషు పేర్కొన్నారు. బుధవారం ఆర్.డి.టి కార్యాలయంలో ఒంటరి మహిళలకు నిత్యావసర సరుకులు12 కిలోబియ్యం 4కిలో రాగి,4కిలో కందిపప్పు 4కిలో గోధుమలు.2 లీటర్ల వంటనూనె,4 సంతూర్ సబ్బులు ఒక్కొక్కరికి చొప్పున మొత్తం 43మందికి అందించారు.

శోభాయమానంగా తొలిశాంభాదేవి రథోత్సవం

విశాలాంధ్ర-లేపాక్షి: మండల పరిధిలోని గోపిందేవరపల్లి గ్రామంలో వెలిసిన తొలిశాంభాదేవి బ్రహ్మరథోత్సవం బుధవారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకం అలంకరించి విశేషంగా పూజలు చేసారు. అనంతరం అమ్మవారిని గ్రామ పెద్దలు దేవాలయం నుండి రథోత్సవం వరకు పల్లకి సేవలో రథోత్సవంను వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా మరబొమ్మలు, ఉజ్జాలు, డ్రమ్స్, మహిళా వీరగాసే నృత్య బృందం, మేళతాళాలతో కన్నులవిందుగా నిర్వహించారు. అలయం నుండి శిరివరంకు వెళ్లే రోడ్డు వరకు ఊరేంపు చేసారు. గణపతి, నవగ్రహ, లక్ష్మినారాయణ, మహాలక్ష్మిస్వరూపిణి, తులసిదేవి ఆవాహన, మహాపూర్ణాహుతి నిర్వహించారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి

www.visalaandra.com

కర్నూలు, గురువారం 14, నవంబర్ 2024

రెడ్ క్రాస్ సేవలను విస్తృతం చేయాలి

విశాలాంధ్ర-అనంతపురం: రెడ్ క్రాస్ సేవలను విస్తృతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,ఐ.ఏ.ఎస్ పిలుపునిచ్చారు. బుధవారం అనంతపురం నగరంలోని పాతఊరులో పాత సిడి హాస్పిటల్ ఆవరణలో ఉన్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భవనంలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ యొక్క సిఎస్ఆర్ యాక్టివిటీ క్రింద ప్లేట్లెట్ కాంపోనెంట్ సపరేటర్, 25 కిలోఓల్ట్స్ సోలార్ ప్యానెల్ లను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ కాపు భారతి, ఆంధ్రప్రదేశ్ స్టేట్ రెడ్ క్రాస్ మెంబర్ కాపు రామచంద్రారెడ్డి, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ జనరల్ మేనేజర్ కేహెచ్ మౌనాష్, వైస్ చైర్ పర్సన్ డా.జి.లక్ష్మణ్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, ఇలాంటి ఎన్నో కార్యక్రమాలని, ఎన్నో సేవలను ప్రజలకు అందించాలన్నారు. రెడ్ క్రాస్‌తో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులై ముందుకెళ్లాలన్నారు. రెడ్ క్రాస్ సొసైటీలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ వారు సిఎస్ఆర్ యాక్టివిటీ క్రింద 30 లక్షల రూపాయల విలువైన ప్లేట్లెట్ కాంపోనెంట్ సపరేటర్,16 లక్షల విలువున్న 25 కిలోఓల్ట్స్ సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.అనంతపురం జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వంను ముమ్మరంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. మెంబర్షిప్ లో రాష్ట్రస్థాయిలో ముందంజలో ఉండడంతో గవర్నర్ అవార్డు జిల్లాకు వచ్చే అవకాశం ఉందన్నారు.అనంతపురం రెడ్ క్రాస్ సొసైటీని ఉత్తమ సొసైటీగా మార్చేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజాసేవలో రక్తం అందుబాటులో ఉంచాలని, యువకులు పెద్ద ఎత్తున ముందుకు వచ్చి మెంబర్షిప్ తీసుకోవాలని, అవసరమైనప్పుడు అందుబాటులోకి వచ్చి ప్రజాసేవ చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కి రెడ్ క్రాస్ సొసైటీ మెంబర్షిప్ కార్డును రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ మెంబర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ మెంబర్ కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అఫేరేసిస్ మిషన్ యొక్క లాభాలను, ప్లేట్లెట్స్ ఇవ్వడం వల్ల ఉపయోగాలను, రక్త దానం చేయడం ద్వారా కలిగేటువంటి ఉపయోగాలను వివరిస్తూ ప్రతి ఒక్కరూ కూడా రక్త దానం చేస్తూ రెడ్ క్రాస్ ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కాపు భారతి మాట్లాడుతూ. రెడ్ క్రాస్ సొసైటీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని, ప్రతి ఒక్క యువత రక్తదానం చేస్తూ తమ ఆరోగ్యాలను కాపాడుకుంటూ ఎంతోమందికి సహాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ కంట్రోల్ అథారిటీ అడిషనల్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ జెడ్ఎం హమంత్, తహసీల్దార్ హరికుమార్, రెడ్ క్రాస్ సెక్రెటరీ మోహన్ కృష్ణ, అదనపు వైద్యాధికారి డా.అనుపమ జేమ్స్, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఎన్సిసి మురళి, నీరజ, జైను బేగం, కార్తీక్, బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఆర్గనైజర్స్ బ్లడ్ డోనర్స్, పవర్ గ్రిడ్ సిబ్బంది, రెడ్ క్రాస్ సిబ్బంది మరియు యువత తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరుకున్న అంగన్వాడి కేంద్రం

విశాలాంధ్ర - ఉరవకొండ : ఉరవకొండ పట్టణంలో అంబే ద్కర్ నగర్ నందు అంగన్వాడి ఆరవ కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది అంగన్వాడి కేంద్రం ఎప్పుడు కూలిపోతుందో అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడికక్కడ గోడలు దెబ్బ తినడమే కాకుండా వర్షం వస్తే నీరు కారుతోందని దీనివల్ల పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని కాలనీ వాసులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని శిథిలావస్థకు చేరుకున్న అంగన్వాడి కేంద్రం స్థానంలో నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కాలనీవాసులు కోరుతున్నారు.

గుడి నిర్మాణం కొరకు 20 వేలు వితరణ

విశాలాంధ్ర-తలుపుల: మండల పరిధిలోని గుండువారిపల్లి పంచాయతీలో ఉన్న ఉన్నత హై స్కూల్ ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న షిరిడి సాయిబాబా గుడి నిర్మాణం కొరకు వేపమానుపేట మాజీ సర్పంచ్ పురుషోత్తమ రెడ్డి కమిటీ సభ్యులు గుడి నిర్మాణం కొరకు చందా అడగగా తక్షణమే ఆయన స్పందించి బుధవారం కమిటీ సభ్యులకు రూ.20 వేలుఅందజేశారు.గ్రామస్తులు కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డుకి ఇరువైపుల కంపచెట్లు తొలగింపు

విశాలాంధ్ర - పెనుకొండ : పట్టణంలో ఉన్న అల్విన్ కాలనీ, ఎక్సైజ్ స్టేషన్ పక్కన ఉన్న రోడ్డు వాహనాలు, ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పోయిన ప్రభుత్వ హయాంలో తాగునీరు, కేబుల్ లైన్ కోసం రోడ్డు పక్కన గుంత తీసి మూయకుండా వదిలి వేశారు.ఈ కాలనీ వాసులు తమ రోడ్డు సమస్యను హిందూపురం పార్లమెంటు సభ్యులు బి కే పార్థసారథి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి తన సొంత నిధులతో బుధవారం జె సి బి ద్వారా ఈ రోడ్డు గుండా ఉన్న ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలను, గుంతను పూడ్చి రోడ్డు వెడల్పు చేశారు. అల్విన్ కాలనీ వాసులు ఈ రోడ్డు విస్తరణ పనులు చేసినందుకు హిందూపురం పార్లమెంటు సభ్యులు బి కే పార్థసారథికి ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు హరి, జావిద్ ఈ రోడ్డు విస్తరణ పనులు పరిశీలించారు.

నేటి నుండి గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర - కొత్తచెరువు : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని గ్రంథాలయ అధికారి కే జయరాం తెలిపారు. వారం రోజులపాటు గ్రంథాలయంలో ఒక్కొక్క రోజు ఒక్కొక్క అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. మొదటి రోజు బాలల దినోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు వ్యాచారచన ,వకృతం పోటీలు, డిజిటల్ గ్రంథాలయాల పై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.ఇందులో గెలుపొందిన విద్యార్థులకు ముగింపు రోజు బహుమతులు ప్రధాన చేయడం జరుగుతుందన్నారు.

కేకాతి గ్రామంలో రెవెన్యూ సదస్సు

విశాలాంధ్ర-గుడిబండ:మండలంలోని గ్రామపంచాయతీలలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శుక్రవారం రెవెన్యూ సమస్యలపై గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి పాల్గొని రైతుల నుండి భూములకు సంబంధించిన 3 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. త్వరలోనే సంబంధించిన క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్జీలు సమర్పించిన రైతులకు పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ మహమ్మద్ బిలాల్, వీఆర్వోలు రామప్ప, గ్రామంలోని ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-లేపాక్షి : లేపాక్షిలోని శాఖ గ్రంథాలయం లో గురువారం నుండి ఈనెల 20వ తేది వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి జయసింహరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారోత్సవాల్లో విద్యార్థులకు గ్రంథాలయాలపై అవగాహన కల్పించి వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వపు పోటీలు, క్రీడలు పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

పంచాయితీ అభివృద్ధి ప్రణాళికపై సమావేశం

విశాలాంధ్ర-లేపాక్షి : లేపాక్షి కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత (ఉర్దు) పాఠశాల లో మంగళవారం 2025-2026 సంవత్సరానికి పంచాయితీ అభివృద్ధి ప్రణాళికపై మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయితీల్లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలని, అవి ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రణాళికలు ఉండాలని ఎంపిడిఓ నరసింహమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డి ఆనందకుమార్, టిఓటిలు రమేష్, సాయిప్రసాద్, నేత్ర, చంద్రకళ పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-శెట్టూరు: గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రికను బుధవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తహాసిల్దార్ ఈశ్వర శెట్టి, విద్యాశాఖ అధికారి శ్రీధర్, ఆవిష్కరించారు.ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి రజిని మాట్లాడుతూ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది నవంబరు 14నుంచి 20వ తేదీ వరకూ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. వారోత్స వాల్లో భాగంగా ప్రారంభం రోజున మొదలుకుని బాలల దినోత్సవం, పుస్తక ప్రదర్శన, విద్యార్థినీ, విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రంథాలయ ఉద్యమకారుల సంస్కరణ సభలు వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతాయన్నారు. వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ గౌతం, వీఆర్వోలు యశ్వంత్, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెప్పోత్సవం

విశాలాంధ్ర - శింగనమల : శింగనమల మండల కేంద్రంలోని శ్రీ రంగరాయల చెరువులో బుధవారం తెప్పోత్సవకార్యక్రమం గ్రామ పెద్దలు ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ,బండారు లీలావతి, బండారు కిన్నెర శ్రీ హాజరయ్యారు, తెప్పోత్సవ కార్యక్రమాన్ని కార్యక్రమాన్ని తిలకించేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి తిలకించారు, భక్తులు గంగాదేవికి పూజలు సమర్పించి దీపాంతులను చెరువులో వదిలి టెంకాయలు కొట్టి పూజలు చేశారు. కార్తీక మాసంలో తెప్పోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని,శింగనమల గ్రామ ప్రజలు, మండల ప్రజలు, ఆయ కట్టు రైతులు,పలు ఆలయాల కమిటీ సభ్యులు,దేవాదాయ శాఖ మరియు ఎండోమెంట్ శాఖ ఆధ్వర్యంలో తెప్పోత్సవం కార్యక్రమంఘనంగా నిర్వహించారు. కార్తీక మాసంలో తెప్పోత్సవ కార్యక్రమం గత శతాబ్దాల కాలం నుండి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని,కార్తీక మాసంలో నిర్వహించే తెప్పోత్సవ కార్యక్రమం ఆరోగ్యానికి, మనశ్శాంతికి భక్తికి ఎంతో శుభప్రదమని,కార్తీక మాసంలో కార్తీక స్నానం ఆచరించడం, దీపం వెలిగించడం ఎంతో శుభప్రదమని పురోహితులు తెలిపారు. కార్తీక మాసం అందరికీ ఎంతో శుభప్రదమన్నారు.గోల్కొండ వెంకట రమణస్వామి,దుర్గాంజనేయస్వామి,షిరిడి సాయినాథ్,శ్రీ సీతా రాములు, శివపార్వ తులు,నగరేశ్వర స్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజలు అనంతరం తెప్పోత్స వంలో ఊరేగించారు.ఈ కార్యక్రమాన్ని తిలకిం చేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

పాఠశాల పరిశీలిన

విశాలాంధ్ర-నార్పల : మండలంలో పలు పాఠశాలలను బుధవారం మండల విద్యాధికారులు కృష్ణయ్య, నారపరెడ్డిలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల పనితీరు, ఉపాధ్యాయులు, యాజమాన్యాల పనితీరు అక్కడ చదువులు పిల్లల మౌలిక సౌకర్యాలు వంటి విషయాలను పరిశీలించారు. ముఖ్యంగా విద్యార్థుల మార్పుల జాబితా వాటి వివరాలు విద్యార్థుల పుట్టిన తేదీ సర్టిఫికెట్లను వారి రికార్డులు పై (అపార్)అయా పాఠశాల యాజమాన్యాలతో చర్చించారు. ఈ సందర్భంగా మిత్ర, నేతాజీ ఎల్ ఎస్ ఆర్ డబ్ల్యు, సరస్వతి పాఠశాలను మండల విద్యాధికారులు పరిశీలించారు.

గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతం చేయండి

విశాలాంధ్ర-కణేకల్లు : శాఖా గ్రంథాలయం కనేకల్ నందు 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నేటి నుండి 20వ తేది వరకు జరుగుతాయి.గ్రంథాలయ అధికారి పొన్నూరు స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఈ గ్రంథాలయ వారోత్సవాల లో భాగంగా 14వ తేది బాలల దినోత్సవం,15వ తేది పుస్తక పఠనం 16,వ తేది గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుట, 17వ తేది కవి సమ్మేళన 18వ తేది విద్యార్థి విద్యార్థులకు క్రీడల పోటీలు నిర్వహించడం 19వ తేది మహిళా దినోత్సవం, 20వ తేది చదవడం మాకి ఇష్టం వారోత్సవాలు ముగింపు వేడుకలు జరుగుతాయని వన్నూరు స్వామి తెలిపారు. ఈ కార్యక్రమములో ప్రజలు,విద్యార్థి విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా ఆయన కోరారు.

టీడీపీ సభ్యత్వంతో భవిష్యత్తుకు భరోసా

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : టీడీపీ సభ్యత్వంతో ప్రమాద బీమా ఇస్తున్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మాజీ సర్పంచ్ కేశప్ప అన్నారు. బుధ వారం మండలంలోని దర్గా హొన్నూర్ గ్రామంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని టిడిపి నాయకులు కార్యకర్తలు విస్తృతంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ ఆనంద్ ,బూత్ ఇంచార్జ్ ముక్కన్నా ,మహమ్మద్ రఫీ ,చెన్నప్ప ,రామస్వామి, సంతోష్ ,వన్నూరు స్వామి ,వి నాగరాజ్ ,నాగప్ప ,వీఎల్ రామాంజనేయులు, నాగరాజు ,కేసిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పిసిఐ చేసుకోవాలి

విశాలాంధ్ర-కదిరి: మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఉన్న లబ్దిదారులు తప్పకుండా (ఎన్‌పిసిఐ) చేసుకోవాలి ఎంపీడీవో పాలప్ప తెలిపారు.ఎన్‌పిసిఐ సమీపంలోని బ్యాంక్,పోస్ట్ ఆఫీస్లలో ఈనెల 15 లోపు లింక్ చేయించుకోవాలని లేనిపక్షంలో హౌస్ హోల్డర్, గ్యాస్ కనెక్షన్, ఉపాధి హామీ వేతనాలు, తల్లికి వందనం, పంట నష్ట పరిహారం ఫీజు రీయంబర్ మెంట్ ఇతర సంక్షేమ పథకాలు జమకావని తెలిపారు.

మల్లినమడుగులో రెవిన్యూ గ్రామ సదస్సు

విశాలాంధ్ర-రొళ్ల: రెవిన్యూ భూ సమస్యలు పరిస్కారం కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తుందని ఇంచార్జ్ తహసీల్దార్ షేక్షావలి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మల్లినమడుగు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రతి రెవిన్యూ గ్రామంలో గ్రామ సభ నిర్వహించడానికి చర్యలు చేపట్టిందన్నారు. ఈ గ్రామ సభలో 120 మంది రైతులు పాల్గొని సమస్యలపై అధికారులకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గిరియప్ప,వీఆర్వో చిరంజీవి,సీనియర్ అసిస్టెంట్ ఉమా మంజునాథ్,టి.ఎన్.టి.యు.సి

మాదిగ ఆత్మీయ సభను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-అనంతపురం: ఈ నెల(నవంబర్)16 వ తేదీన అనంతపురం పట్టణంలో లలిత కళ పరిషత్ నందు మందకృష్ణ మాదిగ ఉమ్మడి జిల్లాల మాదిగల ఆత్మీయ సదస్సును జయప్రదం చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు యల్లప్ప గారి గంగాధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ లలో ఉన్న59 కులాలకు సమన్యాయం జరగాలని గత 30 సంవత్సరాలుగా అనేక రకాల ఉద్యమాల ద్వారా నిబద్ధత ,నిజాయితీతో మంద కృష్ణ మాదిగ పోరాటం చేయడం వల్ల ఇటీవల ఆగస్టు ఒకటో తేదీన భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణను ఏ రాష్ట్రాలకు ఆ రాష్ట్రాలు అక్కడి పరిస్థితులు డిమాండ్‌ను బట్టి సామాజిక న్యాయం దృక్పథంతో ఎస్సీ వర్గీకరణను అమలు చేసుకోవచ్చని తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు. తీర్పు వచ్చిన సందర్భంగా మొదటిసారిగా మాన్య మందకృష్ణ మాదిగ అనంతపురం ఉమ్మడి జిల్లా పర్యటనకు వస్తున్నారన్నారు.ఆత్మీయ సమ్మేళన సదస్సుకు తరలివచ్చి మాదిగల ఐకమత్యాన్ని , చైతన్యాన్ని సమాజానికి చాటాలని కోరారు.

నూతన ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

విశాలాంధ్ర-ఉరవకొండ:ఉరవకొండ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జనార్ధన్ నాయుడును బుధవారం టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు వరప్రసాద్,అంబేద్కర్ నగర్‌యూత్ నాయకులు రవివర్మ, ఓబులేసు,లక్ష్మీనారాయణ,వడ్డే గోవిందు స్థానిక పోలీస్ స్టేషన్లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉరవకొండ మండలంలో శాంతి భద్రతలను పరిరక్షించాలని కోరారు.

వివాహ వేడుకకు హాజరైన మండల కన్వీనర్

విశాలాంధ్ర-యాడికి: తొండపాడు గ్రామంలోని ఆర్యవైశ్య శ్రీరంగ కల్యాణమండపంలో బుధవారం ఆకుల వారి వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులు స్వాతి వెడ్స్ యశ్వంత్‌లను వైసిపి మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్ ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు అవుకు నాగరాజు,గొడ్డుమర్రి రామమోహన్ వార్డ్ సభ్యులు పేరం పరమేశ్వర రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి కోట చౌదరి,సిమెంట్ శివ,తాటి రాజా,ఆకుల సురేష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

విశాలాంధ్ర-గుడిబండ : మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కూటమి ప్రభుత్వం చేపట్టినటువంటి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణపై 2025-26 ఆర్థిక సంవత్సరానికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, గుడిబండ పంచాయతీ కార్యదర్శి ప్రకాష్ మాట్లాడుతూ గుడిబండ మండల కేంద్రాన్ని మరియు మండలంలోని గ్రామాలన్నిటిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవడమే మన ధ్యేయమని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు సర్పంచ్ లు తిప్పేస్వామి, రంగస్వామి, ఎంపిటిసి పుష్పలత నాగేంద్ర, తదితర సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరించండి

గ్రామసభలో రైతులు విన్నపం

విశాలాంధ్ర - అగళి : మండలంలోని వివిధ గ్రామాల్లో మిగులుగా ఉన్నా భూములు సెటిల్ కానీ భూములు రెండు లక్షల ఖాతాల వరకు ఉన్నాయని ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని నరసంబూది గ్రామంలో బుధవారం జరిగిన రెవిన్యూ గ్రామం సదస్సులో రెవిన్యూ అధికారులకు రైతులు వినతిపత్రం అందజేశారు.మడకశిర ఎంఎల్ఏ టీడీడీ బోర్డ్ మెంబర్ ఎం ఎస్ రాజు మడకశిర టీడీపీ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశాల మేరకు నరసంబుది గ్రామంలో గల మిగులు భూములు సెటిల్ కానీ భూములు రెండు లక్షల ఖాతాలో గల భూములకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని తహసీల్దార్ సుబ్బారావు ఆర్ చంద్రశేఖర్ కు విన్నవించారు. ఈసందర్భంగా 11 దరఖాస్తులు రాగ 5 దరఖాస్తులు పెన్షన్ కు సంబందించినవి కాగ 2 హౌసింగ్ కు సంబందించినవి 4 దరఖాస్తులు రెవిన్యూ కు సంబందించినవని తహసీల్దార్ సుబ్బారావు తెలిపారు.ఈకార్యక్రమంలో వీఆర్వో వీఆర్ ఎ మండల ప్రధాన కార్యదర్శి జయప్ప తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-పుట్టపర్తి: గ్యాస్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బుధవారం ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8 ,9 ,10 విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్యాస్ నిర్వహకులు రాజీవ్ మాట్లాడుతూ చేసి క్విజ్ నిర్వహించామన్నారు.ఈ క్విజ్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశామన్నారు. ఈ గ్యాస్ వినియోగంపై విద్యార్థిని విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సేజించి నిర్వాహకులు సమాధానాలు చెప్పడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల, గ్యాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై ఉక్కు పాదం

విశాలాంధ్ర-పుట్టపర్తి : పుట్టపర్తి మండలం పెడపల్లిలో అక్రమ మద్యం విక్రయిస్తున్న స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని 20 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉమా మనోహర్ రాజు, సునంద, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు గోడ పత్రిక ప్రదర్శన

విశాలాంధ్ర-రొద్దం: స్థానిక గ్రంథాలయ అధికారి ఆధ్వర్యంలో బుధవారం 57 వ జాతీయ గ్రంథాల వారోత్సవాల గోడ పత్రికలను స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ టి చకాన్వెంట్ తదితర పాఠశాలలో ఉపాధ్యాయ ద్వారా గోడ పత్రికలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నారాజు మాట్లాడుతూ చాచా నెహ్రూ నవంబర్ 14 బాలల దినోత్సవం పురస్కరించుకొని,ఈ వారోత్సవాలు వివిధ రకాల సాంస్కృతిక చిత్రలేఖనం తదితర వివిధ కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు గ్రంథాలయం విజ్ఞాన భాండాగారమని 20వ తారీకు వరకు కార్యక్రమాలు జరుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర - హిందూపురం : ఎమ్మెల్యే శ్రీ నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు ఒకటవ వార్డు కొల్లకుంట గ్రామంలో, టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం బుధవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, టీడీపీ శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు వడ్డె అంజీన్నప్ప, లీగల్ సెల్ అధ్యక్షులు డి.శివ శంకర్, ఒకటవ వార్డ్ ఇంచార్జ్ శేఖర్, టీడీపీ సీనియర్ నాయకులు ఎక్స్ డీలర్. లక్ష్మీనారాయణ, ఎన్. రామంజి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ పంచాయితీ అభివృద్ధిపై శిక్షణ

విశాలాంధ్ర- శెట్టూరు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక మీద రెండో రోజు ప్రజా ప్రతినిధులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రఘు రామారావు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక యొక్క ముఖ్య ఉద్దేశం సామజిక న్యాయం,ఆర్థిక అభివృద్ధి చెందడం అవసరమని వారు పేర్కొన్నారు. ప్రజలందరిని భాగస్వాములు చేసి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేసినప్పుడే అందరికీ ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో శేషారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ ఆనంద్, టైపిస్ట్ మెర్సిక,గ్రామపంచాయతీ కార్యదర్శులు ఫక్రుద్దీన్, వ్యాసరావు తిప్పేస్వామి, డిజిటల్ అసిస్టెంట్లు, కవిత గాయత్రి,విజయేంద్ర,వినోద్ గ్రామ సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

డేటా అప్డేషన్‌ను అకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-గుత్తి: జిల్లా పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జ్యోతి బుధవారం గుత్తి మునిసిపాలిటీ పరిధిలో సి.పి.ఐ కాలనీ వద్ద ఎస్ ఎచ్ జి ప్రొఫైలింగ్ డేటా అప్డేషన్ ను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మెప్మా టీ.యం.సి, సి.ఓ లకు ఆదేశాలుగా ప్రతి రోజు 2 సంఘాల సమాచారం ఆన్లైన్ చేయించాలని డేటా ప్యూరిఫికేషన్ ను ఇచ్చిన షెడ్యూల్ లో పూర్తి చేయించాలని తెలిపారు. ప్రొఫైలింగ్ డేటాను చేస్తున్న ఆర్.పి లు, సంఘం సభ్యులు షెడ్యూలు తేదీయందు సభ్యులందరూ హాజరై సంబంధిత డాక్యుమెంట్లన్నీ సిద్ధంగా ఉంచుకుని నిర్ణీత సమయంలో సభ్యులందరి లైవ్ ఫోటో, వ్యాపార సంబంధిత ఫొటోలతో , ఆధార్, రేషన్, గ్యాస్ బుక్, పాన్ కార్డు, ఓటిపి కోసం మొబైల్ ను తమ వెంట తేచ్చుకునేలే ఒక రోజు ముందు సంఘం సభ్యులకు తెలియజేసి సర్వే ను పూర్తి చేయాలని జ్యోతి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్, అనంతపురం మెప్మా అధికారులకు, సిబ్బందికి, ఆర్.పి లకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మెప్మా అధికారి భవాని, టి.యం.సి శ్రీనివాసరెడ్డి, సి.ఓలు చంద్ర శేఖర్, సురేఖ, మెప్మా సిబ్బంది, ఆర్.పి లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చు చేయాలి

విశాలాంధ్ర-పెనుకొండ: అంగన్వాడి మినీ సెంటర్ లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ జీవోలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 16న ధర్నాను జయప్రదం చేయాలని అంగన్వాడి వర్కర్స్‌కు పిలుపునిచ్చిన సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్,మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 8637 సెంటర్లో మినీ వర్కర్స్ పనిచేస్తున్నారు, మొదట్లో మినీ వర్కర్‌కు లబ్ధిదారులకు ఆహారం అందిస్తే చాలని నియమించారు. నేడు మెయిన్ అంగన్వాడీ సెంటర్లో వర్కర్లు హెల్పర్స్ చేసే పనులు మినీ వర్కర్స్‌తో చేస్తున్నారు. మినీ సెంటర్లో మెయిన్ సెంటర్లుగా మార్చాలని గత మూడు సంవత్సరాలుగా వివిధ రూపాల్లో పోరాటాలు చేస్తూనే ఉన్నారు. ప్రభుత్వం ఏర్పడి 5 నెలలు పూర్తవుతుంది 42 రోజులు సమ్మె సందర్భంగా ఇచ్చిన మినిట్స్ కాఫీ అమలు చేయాలని అనేకమార్లు మంత్రులు, ఎమ్మెల్యేలకు, అధికారులకు, ముఖ్యమంత్రి కి వినతిపత్రులు ఇచ్చిన ఫలితం లేదు ఈ నేపథ్యంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సందర్భంగా మినీ అంగన్వాడి సెంటర్ ను మెయిన్ సెంటర్లుగా మార్చుతూ వెంటనే జీవో ఇవ్వాలని తదితర సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 16న సత్యసాయి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నాకు అధిక సంఖ్యలో పాల్గొనీ ధర్నా జయప్రదం చేయాలని. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి భావమ్మ, సెక్టర్ లీడర్లు సావిత్రమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

విశాలాంధ్ర-రొళ్ల: మండలంలోని కె.గొల్లహట్టి గ్రామంలో విస్తృతంగా పర్యటిస్తూ తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని యూనిట్ ఇంచార్జ్ వెంకటేష్ ఆధ్వర్యంలో తెదేపా సభ్యత్వ నమోదు ఊపందుకుంది. బుధవారం జరిగిన టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వారు కార్యకర్తలతో కలిసి వేగవంతం చేశారు. మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు,మడకశిర ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, తెదేపా మండల అధ్యక్షుడు దాసిరెడ్డి ఆదేశాల మేరకు తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ రామకృష్ణ, కిట్టప్ప, ముద్దప్ప తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకుంటే మెరుగైన ఆరోగ్యం

విశాలాంధ్ర-రాప్తాడు: గర్భిణులు నాణ్యమైన పోషకాహారం తీసుకుంటే మెరుగైన ఆరోగ్యంతో ఉండవచ్చని డాక్టర్ శివకృష్ణ సూచించారు. రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని డాక్టర్ శ్రావణితో కలిసి నిర్వహించారు. 70 మంది గర్భవతులకు రక్త పరీక్ష, బి.పి,డయాబెటీస్,హిమోగ్లోబిన్, తదితర పరీక్షలు చేయడం జరిగింది. ఎక్కువ ప్రమాదకర గర్భవతులకు ప్రత్యేక పరీక్షలు చేసి ఆరోగ్య భద్రతపై కౌన్సిలింగ్ ఇచ్చారు. జరిగినది. గర్భవతిగా ఉన్నప్పుడు ఆహారం, వైద్య పరీక్షలు,స్కానింగ్ పై అవగాహన కల్పించారు. వైద్య పరీక్షలకు వచ్చిన గర్భవతులకు, సిబ్బందికి ఫార్మసిస్టు మూర్తి పౌష్టికాహార బోజన వసతి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు అరుణ, నరసింహ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్ బాబు, యం.పి.హెచ్.ఎ లు, ఎం.ఎల్,హెచ్.పిలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గృహప్రవేశానికి హాజరైన మండల కన్వీనర్

విశాలాంధ్ర-డి.హీరేహాళ్: మండలంలో మలపనగుడి గ్రామంలో బుధవారం నూతనంగా నిర్వహించిన గృహప్రవేశానికి మండల వైసీపీ కన్వీనర్ వన్నూరు స్వామి పాల్గొన్నారు. ఇంటి యజమాని వన్నూరు స్వామికి శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిద్దాపురం రవి, రాఘవేంద్ర, గోవర్ధన, దేవన్న, తిప్పేస్వామి, ఉలిగేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి గ్రంథాలయంలో వారోత్సవాలు

విశాలాంధ్ర-బెలుగుప్ప : స్థానిక గ్రంథాలయంలో గురువారం నుండి వారం రోజులు పాటు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తామని గ్రంథాలయ అధికారి ఏ.ప్రతాప్ రెడ్డి తెలిపారు. అనంతరం మాట్లాడుతూ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు 14వ తేదీ ప్రారంభ వేడుకలు, బాలల దినోత్సవం నిర్వహిస్తామని15వ తేదీన పుస్తక ప్రదర్శన ఏర్పాటు,మాదక ద్రవ్యాలపై అవగాహన,పుస్తక పఠన ప్రాముఖ్యత16వ తేదీన గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను స్మరించుట 17 వ తేదీ కవి సమ్మేళనం, సెమినార్లు, రచయితల సందేశాలు18వ తేదీ విద్యార్థులకు చిత్రలేఖనము, వ్యాసరచన వకృత క్విజ్ మరియు క్రీడపోటీలు 19వ తేదీ మహిళలకు వివిధ కార్యక్రమంలో పోటీలు నిర్వహించుట(రంగవల్లి అల్లికలు) కార్యక్రమం నిర్వహించడం, అనంతరం ముగింపు వేడుకలు నిర్వహిస్తామని ఇన్చార్జ్ గ్రంథాలయ శాఖ అధికారి తెలిపారు.

నిరంతర అన్వేషణతో విజయాలు

విశాలాంధ్ర - జెఎన్టియు ఏ : పాఠ్యాంశాలపై నిరంతర అన్వేషణతో విజయ శిఖరాలను చేరుకోగలరని పి వి కేకే పీజీ కళాశాల ప్రిన్సిపల్ దా. ముని కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో మొదటి సంవత్సర వృక్ష శాస్త్ర విభాగంలో విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. మొదటి సంవత్సరంలో కోర్స్ యొక్క ఆవశ్యకత ఉపాధి కల్పన, పరిశోధనపై వివరించారు.కొత్త సిలబస్ ప్రాముఖ్యతను విద్యార్థులకు పరిచయం చేశారు.త్వరలో జరగబోయే అంతరంగక పరీక్షల లో సన్నద్ధత అంశాలపై సంక్షిప్తంగా తెలిపారు. వృక్ష శాస్త్ర విభాగం అధ్యాపకులు జోష్న, డా. పుల్లన్న ,నర్మదా, కామర్స్ విభాగ అధిపతి జి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.మొదటి సంవత్సరం విద్యార్థులు రెండో సంవత్సరం విద్యార్థులను పలకరింపులతో ఉత్సాహంగా వేడుకలను చేపట్టారు.

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-ఉరవకొండ: గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించే గ్రంథాలయ వారోత్సవాల గోడపత్రికను బుధవారం స్థానిక గ్రంథాలయంలో మండల విద్యాశాఖ అధికారులు ఈశ్వరప్ప, రమాదేవి, ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రంథాలయ అధికారి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమా ఆదేశాలతో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చివరి రోజు ప్రతిభ కనబరిచినవిద్యార్థులకు బహుమతులను ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. ఈ వారోత్స వాల్లో ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.